# సీతమ్మ

బిర. రాజు

అది కృష్ణాజిల్లాలో ఓ చిన్న గ్రామం. ఆ వూళ్లో ఉన్న చిన్న స్కూల్‌కి నన్ను మాష్టారుగా వేసేరు. అదే నాకు మొదటి ఎప్పాయింట్‌మెంటేమో పెట్టే, బేడా సర్దుకుని ఉత్సాహంగా బయలుదేరాను. ఆ వూరు నే నిదివర కెప్పుడూ చూళ్ళేదు. ఆ మాటకొస్తే పుట్టిపెరిగిన మా వూరు, దాని పక్కనున్న చిన్న పట్టణం తప్ప నే నేవూరూ చూళ్ళేదు. అయితే చిన్నప్పట్నుంచీ పెరిగిన వూరిని, తల్లిదండ్రుల్ని ఒక్కసారిగా వదిలిపెట్టి మరోవూరు చేరాలంటే కొద్దిగా బెంకగానే ఉంది. నేను పుట్టి పెరిగింది పల్లెటూళ్లోనయినా, నిజం చెప్పాలంటే మా వూర్లో రాజకీయ ఎత్తుగడలు తక్కువే. ఒకవిధంగా చెప్పాలంటే మాది ఆదర్శమయిన పల్లె. నేనింత యిదిగా ఎందుకు చెపుతున్నానంటే పల్లెలూ వాటిలోని రాజకీయాలూ అంటే నాకు చచ్చేటంత భయం. పైగా నేనదో రకమైన మనిషిని. నా సంగతి తప్పించిఎదుటివారి విషయాల్లో అంతగా తలదూర్చను. అందుకే కొత్త భయం భయంగానే వుంది మనసులో. బస్సెక్కిన తర్వాత ఎందుకైనా మంచిదని కండెక్టరుకు ముందే చెప్పేసాను. "నేను ఫలానా వూర్లో దిగాలి, ఆ వూరికి నేను కొత్త, కాస్త ఆ వూరు వచ్చినపుడు నాకు జ్ఞాపకంచేయమని."

ఎంతో వేగంగా, నేర్పుగా నడుపుకుంటూ వచ్చిన బస్సును ఒక్కసారిగా బ్రేకువేసి, బీడీ దమ్ము లాగటానికి కామోసు డ్రైవర్ సీటు దిగాడు. కొద్దిగా కునుకుపడుతున్న నేను,

"మీరు దిగవలసిన స్టాపిదే మాష్టారూ" అన్న కండక్టర్ స్వరంతో ఉలిక్కిపడి లేచి, నా సరంజామా తీసుకొని బస్సు దిగాను. నన్ను ఒంటరిగా వదిలేసిన బస్సు హడావుడిగా వెళ్ళిపోయింది.

బస్సు దిగి నేను చుట్టూరా చూసాను. అది మట్టిరోడ్డు. రోడ్డు కిరుపైపులా పొలాలు. కోతలసమయమేమో ఏపుగా పెరిగిన పచ్చని పొలాలమీదనుంచి వస్తున్న చల్లని పిల్లగాలి శరీరానికి గిలిగింతలు పెడుతోంది. కనుచూపు మేరలో ఏవో కొంపలు కనిపించసాగాయ్.

"ఏమిటి దారి మధ్యలో దింపేసాడు బస్సు? ఈ వూరికి 'బస్సుస్టాండు' కూడ లేనట్టుంది." నాలో నేనే అనుకుంటూ

నా‌మాన్లు తెలుసుకోని నమ్మదిగా బయలు దేరాను ఎటువైపు పోవాలో సరిగ్గా తెలీకుండానే.

"చూడండి! వూర్లోకి పోవాలంటే ఎటు పోవాలి? ఏది దగ్గర దారి?" దార్లో ఎదురొచ్చిన నడివయస్సు అసామిని ప్రశ్నించాను.

ఆ అసామి నన్ను కిందనుంచి పైకొకసారి ఎగాదిగా చూసి, నోట్లోంచి చుట్టతీసి తుపుక్కున ఉమ్మేసి, "ఏంది బాబూ! తమ రీ వూరికి కొత్తోరులా వున్నారే!" అంటూ నా జవాబు కూడా వినకుండా, "ఈ చెరువు గట్టట్టుకుని నేరుగా ఎల్లిపొండి – రెండు పర్లాంగుల దూరంలో వూరొత్తాది" – అంటూ ఓ గట్టువైపు చూపించి, "ఎళ్ళొత్తానండి!" అంటూ వెళ్ళిపోయాడు.

వూళ్ళోంచి నడుస్తూ వెళ్తున్న నన్ను 'జూ'లో వింత జంతువును చూస్తున్నట్టు విచిత్రంగా చూడసాగారు, అరుగుల మీద, చెట్లక్రింద నుంచున్న ఆ వూరి ప్రజలు. ఆ వూర్లో నాకు తెలిసిన బంధువులు కాని, స్నేహితులు కాని ఎవరూ లేనందున ఎటు పోవాలో తెలీక రెండు నిమిషాలు ఆలోచించి, చివరికో పెద్దమనిషి నడిగాను. "బాబూ! ఈ స్కూల్ హెడ్‌మాష్టారుగారి ల్లెక్కడో కొస్త చెపుతారా?"

"రండి సూపెడతాను." అంటూ ఆ పెద్దమనిషి త్రోవ చూపించ సాగాడు.

రెండడుగులు వేసిన తర్వాత అడిగాడు. "మీరేనేటి బాబూ! ఈ వూరికి కొత్తగా వచ్చిన మేట్టారు?"

"అవును నేనే!" సమాధానం చెప్పాను.

"బాబూ మీరేటీ అనుకోపోతే ఓ మాట." క్షణం ఆగి అన్నాడు.

"ఏమిటి?"

"ఏంనేదు బాబూ! ఇదివరకొచ్చిన మేట్టారు లందరూ అదోరకమైనోళ్ళు. అళ్ళు పిల్లలకి పాటాలు సెప్పటంకన్నా, వూళ్ళో యిషయాలమీ దెక్కువ మోజు సూపించేవోరు. వచ్చిన పతీవోడు దెబ్బలాటలతో నే ఎల్లిపోయాడు. మీరైనా కాస్త జాగర్తగా పాటాలు సెప్పండి బాబూ!" – అతని గొంతులో ఆ వూరి పిల్లలమీద ఎంత ఆప్యాయత? తన వూళ్ళోని పిల్లలు పెద్ద పెద్ద చదువులు చదువుకొని మంచి పౌరులు కావాలని ఎంత ఆతృత? నిజంగా నాకు చాల ఆశ్చర్యం వేసింది.

"తప్పకుండా, మీ వూరి పిల్లలని అభివృద్ధిలోనికి తీసుకురావటానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను." హామీ యిస్తున్నట్టుగా అన్నాను.

"ఇదే, మేట్టారిల్లు–మేట్టారుగోరూ! మీ కోసం ఎవరో వచ్చారండీ!" అంటూ గట్టిగా ఓ కేకేసి, "నే నెళ్ళొత్తా

బాబూ! ఇక్కడే ఉంటారుగా తవరూ, కనబడతా వుంటాలెండి," అంటూ వెళ్ళిపోయాడు.

తలుపు తీసిన బట్టతల నడి వయస్సాయనని హెడ్ మాష్టారుగా గుర్తించి, నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"రండి, రండి. నేనే హెడ్ మాష్టార్ని." సాదరంగా ఆహ్వానించారు. మా యిద్దరి పరిచయాలు ముగిసాయి.

ఆ రోజు ఆదివారమేమో, హెడ్ మాష్టారు వారింట్లోనే ఉన్నారు. ఆ రాత్రి ఆయనింట్లో ఆతిధ్యం స్వీకరించవలసి వచ్చింది. హెడ్‌మాష్టారు ఆ వూర్లో విషయాలు ముఖ్యంగా ఆ వూర్లోకి వచ్చివెళ్ళిన మాష్టార్ల గత చరిత్రలూ, రాజకీయాలూ, ఎన్నో చెప్పారు.

"ఎందుకైనా మంచిది, ఓ సారెళ్ళి ఈ వూరు మునసబును పలకరించి రా" అన్న హెడ్‌మాష్టారి మాటతో, మునసబుగారి పరిచయాన్ని కూడ చేసుకున్నాను.

* * *

పది రోజులు గడిచాయి. నేను చిన్న గది అద్దెకు తీసుకొని స్కూల్‌కి దగ్గరగా ఉంటున్నాను. 'ఒక్కడినే కదా' అని 'స్వయంపాకం' కూడ మొదలుపెట్టేసాను. అంట్లుతోమడానికి, గది వూడ్చడానికి ఓ పనిమనిషిని కుదుర్చుకున్నాను.

ఓ రోజు—

"మేష్టారు బాబూ! మేష్టారు బాబూ!" అని ఎవరో పిలవటంతో దుప్పటిముసుగు తీసి వెళ్ళి తలుపు తీసాను. వాకిట్లో ఎవరో నిలబడున్నట్లు గ్రహించాను.

"ఎవరదీ?" వరండాలో నున్న లాంతరు 'వత్తి'ని పెద్దదిచేస్తూ ప్రశ్నించాను.


"నేను సీతమ్మను బాబూ! ఈ యింటికి రెండిళ్ళవతల మా యిల్లు – పాల వ్యాపారం చేసుకొంటాను" అంది ఓ స్త్రీ గొంతు.

అప్పుడు చూసాను. ఆ స్త్రీ, యాభై ఐదు, అరవై మధ్య వయసులో వుంది. కొద్దిగా ముడతలుపడిన శరీరం, చాలమట్టుకు తెల్లబడిన వెంట్రుకలు, ముక్కుపుటాలకి రెండింటికీ మెరుస్తున్న బంగారు పుడకలు, కాళ్ళకు మట్టెలు, నుదుట ఎర్రటి నయాపైసంత కుంకుమ బొట్టు. మనిషిని చూడగానే ఏదో ఓ పవిత్రమైన, పూజ్యనీయమైన భావం కలిగేట్టుంది. ఓ నిముషం చూసిన నేను,

"ఏమ్మా! ఏం కావాలి మీకు?" ఈ స్త్రీకి నాతో పనేమిటా అనుకొంటూ ప్రశ్నించాను.

"ఏం లేదు బాబూ! మీరు వాడుకగా నా దగ్గర పాలు పోయించుకుంటారేమో తెలుసుకొందామని వచ్చాను" అంది.

అప్పుడు నాకు జ్ఞాపకం వచ్చింది, నే నింతవరకూ ఎక్కడా పాలు వాడకం కుదుర్చుకోలేదని.



"అలాగేనమ్మా, రేపట్నుంచి పాలు పోస్తుండు," అన్నాను.

"అదేటి బాబూ, మీరేటో అమాయకుల్లా ఉన్నారే! ఎంతకి పోస్తావ్? ఏవిటి అని అడగకుండానే పోసేయ్యమంటున్నారు," అంది సీతమ్మ నవ్వుముఖంతో.

"వూళ్ళో అందరికీ ఎంతకి పోస్తున్నావో, అంతకే పోయి" ఆవలిస్తూ అన్నాను.

ఆమె ముఖం సంతోషంతో వెలిగింది ఓ క్షణం.

"వస్తాను బాబూ! ఏటి అనుకోకండి ఇంత పొద్దుటేల లేపేసానని. ఎండెక్కిపోతే పొలంపన్లోకి వెళ్ళిపోతాను. మిమ్మల్నప్పుడు కలుసుకోడం పడదని ఈవేళప్పుడొచ్చాను ఏమనుకోకు బాబూ! ఏదో ముసలిముండని, చాదస్తం కాస్త ఎక్కువ" అనుకుంటూ వెళ్ళిపోయింది.

లోపలికి వెళ్ళిపోయిన నాకు మళ్ళీ నిద్రరాలేదు, ఎంత ప్రయత్నించినా. టేబుల్‌మీదున్న గోర్కీ నవల 'మదర్' చదవటం ప్రారంభించాను. అలా చదువుతూ చదువుతూ ఎప్పుడు నిద్ర పోయానో నాకు తెలీదు. బాగా ప్రొద్దెక్కిన తర్వాత మెలకువొచ్చింది. గబగబా కాలకృత్యాలు ముగించుకొని 'స్కూల్'కి వెళ్ళిపోయాను.

రెండు రోజులు గడిచాయి. నేను చెప్పిన మరుసటిరోజునుంచీ సీతమ్మ ఉదయమే ఆరుగంటలకల్లా పాలు పోసి వెళ్ళేది. సీతమ్మను చూసినప్పుడల్లా ఎందుకో నాకు ఆత్మీయులెవరో చూసినట్లుగా అనిపించేది. ఆమె మాటలు వింటూంటే దూరంగా నున్న మా అమ్మ పలకరింపులా, తీయగా, చల్లగా, ఎంతో మధురంగా అనిపించేది. అందుకే కావాలని సీతమ్మతో రెండు మాటలు ఎక్కువ మాట్లాడేవాడిని, తక్కువ మాట్లాడే అలవాటున్న నేను.

ఆ రోజు సాయంత్రం స్కూల్ అయిపోయినతర్వాత 'షికారు'కి చెరువు

గట్టువైపు వెళ్ళాను. గట్టుదగ్గర మునసబు, వారి సహచరులు రాబోయే 'ప్రెసిడెంట్' ఎలక్షన్ల గురించనుకుంటా మాట్లాడుకొంటున్నారు. ఆ వూరి 'ప్రెసిడెంట్'గారు ఆమధ్యనే అకస్మాత్తుగా కాలంచెందారట. అప్పట్నుంచీ కొత్త ప్రెసిడెంటుగా ఎవరికిస్తే ఉపయోగంగా వుంటుందోనని! – ఎవర్ని నిలబెట్టాలా? అని రాజకీయ ఆలోచనలు జరుగుతున్నాయని ఆ మధ్యన మా హెడ్‌మాష్టారుగారన్నట్లు జ్ఞాపకం. ముందే చెప్పానుగా, నాకు రాజకీయాలంటే తలనొప్పని. అందుకే మునసబుగారు నన్ను చూడకుండానే, నెమ్మదిగా వెళ్ళిపోదామనుకుంటుండగా, ఆయన నన్ను చూడనే చూసారు.

"మేష్టారూ! రండి, రండి. మళ్ళీ కనిపించనేలేదు మీరు? మీలాంటి కుర్రవాళ్ళనీ, బుద్ధిమంతుల్నీ నేనెక్కడా చూళ్లేదనుకోండి" అంటూ పిలవనే పిలిచాడు మునసబు.

"నమస్కారమండీ. నేను చూళ్ళేదు మీరిక్కడున్నట్టు." కావాలని అబద్ధం ఆడేసాను.

మునసబుగారు ఆయన సహచరులకు నన్ను పరిచయంచేసారు రెండు నిమిషాలు వాళ్ళలోవాళ్ళు ఏవో రాజకీయాలగురించి మాట్లాడుకున్నారు. నేను మౌనంగా వినసాగాను. ఓ క్షణంతర్వాత, మునసబుగారు నావైపు తిరిగి, "ఏవిటి మాష్టారూ, మిరు ఆ కులంతక్కువ సీతమ్మదగ్గర పాలుపోయించుకుంటున్నారట. మీకు తెలీదా? ఏదో క్షమించి దాన్ని వూళ్ళో వుంచుతున్నాం గాని, లేకపోతే ఎప్పుడో తరిమేసేవాళ్ళం – అది, దాని మొగుడు చేసిన పనికి 'జాత్తక్కువ ముండ'" తిట్టుకుంటూ ఉమ్మేసాడు మునసబు. ఆయనకి వంత పాడారు బృందగీతంలా ఆయన సహచరులు.

నాకేం అర్థంకాలేదు – కులంతక్కువ కావటానికి, ఆమెదగ్గర పాలుపోయించుకోవటానికి గల సంబంధం. 'స్వచ్ఛమైన తెల్లని పాలు, పవిత్రతకు మారుపేరైన పాలు – కులంతక్కువవాళ్ళ చేతినుంచి వచ్చినంతమాత్రాన వాటి పవిత్రత పోతుందా?" వాళ్ళ అమాయకత్వాన్ని ఎలా అంచనావేసుకోవాలో తెలీక అలా చూస్తూవుండిపోయా నో క్షణం.

"ఏదో యింటికి దగ్గరే ఉందికదా, అని పోయించుకుంటున్నాను. అయినా పాలు పోయించుకోవటానికి కులమేటి లెండి?" అనేసాను.

"సరే, మీ యిష్టం. చెప్పటం మంచిదేమోనని చెప్పాం. అయినా తర్వాత మీకే తెలుస్తాది లెండి దాని చరిత్రంతా. మా నోటితో చెప్పటం ఎందుకు?" ముఖం మాడ్చుకుంటూ అన్నాడు మునసబు.

"వెన్తానండి" - నమస్కారం చెప్పి బయలుదేరాను యింటికి.

"ఈ రోజుల్లో కుర్రాళ్ళకి బొత్తిగా జ్ఞానం తగ్గిపోతుందండీ, ఎట్లా చదువుతారో ఏమో గాని అందర్నీ రాసుకు పూసుకు తిరుగుతుంటారు. ఎవడిచేత్తో మంచినీళ్ళిచ్చినా తాగేస్తారు. వాడి కులమేమిటీ? గోత్రమేమిటీ? ఇదేమీ పట్టించుకోరు. ఏమంటే అది నాగరికత అంటారు. ఏం నాగరికతో, ఏమో! అందుకే కాలం ఇలా తగలడుతోంది. చిన్నా-పెద్దా, యజమాని-నౌకరు తేడా తెలీకుండా-" వాళ్లు వెనకనుంచి మాట్లాడు కుంటున్న మాటలు నెమ్మదిగా నా చెవులకు దూరం కాసాగాయి.

ఇంటికొచ్చిన నేను ఆలోచనలో పడ్డాను. మునసబు బృందం మాటలు నా మదిలో మెదులుతున్నాయ్. 'ఏమిటి సీతమ్మ వెనకాలొక కథ ఉందా? ఏమై ఉంటుంది?' సాధారణంగా ఎవరి విషయాల్లోనూ జోక్యంచేసుకోని నేను, నెమ్మది నెమ్మదిగా నా పరుధులు దాటు తున్నాను. బహుశా నాకు సీతమ్మ మీదున్న సద్భావంవలన కావచ్చు. అయితే నేను సీతమ్మని ఈ విషయాలేవీ అడగదలచుకోలేదు.

ఆ మరుసటిరోజు ఉదయం యధా ప్రకారం, పాలు పోయటానికి వచ్చింది సీతమ్మ. మనిషి దిగులుగా కనిపించింది.

"ఏం అవ్వా, అలా ఉన్నావ్?" ప్రశ్నించాను. ఈ మధ్యన సీతమ్మను అలా పిలవటం నేర్చుకున్నాను.

"బాబూ, మీరు నా దగ్గర పాలు పోయించుకోవటం మానేస్తారా?" నెమ్మదిగా, దిగులుగా అడిగింది. "బాబూ! మీరు మన మునసబు మాటలు నమ్మకండి. నామీద కిట్టక అతనేవేవో చెపుతుంటాడు. కులంకి తక్కువోళ్ళమే కావచ్చు. కాని 'గుణం'కి పెద్దకులపోళ్ళకన్నా ఎక్కువే బాబూ. ఈ పేటలో నేను పాలుపోసేదే రెండు, మూడిళ్ళకి. మీరు కూడ పోయించుకోవడం మానేస్తే, మాలాంటోళ్ళ బతుకులెట్టా గడుస్తాయి? ఏదో ఉన్న ఒక్క ఆవుతోటీ చాలీ చాలకుండా కాలం నెట్టుకొస్తున్నాను. మీరు కూడ నేను తినే కూటిలో మట్టేస్తారా బాబూ!" గద్గద స్వరంతో అంది సీతమ్మ.

"లేదు, అవ్వా - నేనటువంటి విషయాలు పట్టించుకోను. అయినా, నీకెలా తెలిసింది మునసబు నన్నీ విషయం అడిగినట్లు?"

"తెలీడానికేముందిలే బాబూ, పల్లెటూరిలో ఏ విషయం అయినా ఇట్టే తెలిసిపోతాది," అంది.

"చూడు అవ్వా, ఒకళ్ళు చెప్పారని నేనెప్పుడూ ఏదీ ఆలోచించకుండా చేయను. మునసబు ఈ వూరికి పెద్దే కావొచ్చు. మీ మధ్య తగాదాలు వుండొచ్చు. అంతమాత్రాన ఆయన,

నీమీదేదో చెబితే, అది నమ్మేసేటంత చిన్న స్వభావం కాదు నాది." కొంచెం ఆవేశంగా అన్నాను.

"వెళ్ళొస్తాను బాబూ, కృతజ్ఞతాపూర్వకంగా నా కళ్ళలోకి చూసి చెప్పింది."

నేనేం మాట్లాడలేదు. అవ్వ వెళ్ళిపోయింది. ఆ తరువాత రోజూ మామూలుగా పాలు పోసి వెళ్ళేది. ఓ రెండురోజులు వరుసగా అవ్వ రాలేదు పాలు పోయటానికి. ప్రతిదినం అవ్వతో బాతాఖానీ బాగా అలవాటైపోయిందేమో, ఆమె రాకపోతే నాకేదో దిగులుగా అన్పించసాగింది. నా కా వూళ్ళో ఉన్న ఒకే ఒక్క అనుబంధం అవ్వతోనే. కొంపదీసి అవ్వకేమీ జబ్బుచేయలేదు కదా? అనుమానంతోపాటు ఆత్రుత చెలరేగింది నాలో.

ఇంకో రెండు రోజులు గడిచాయి. అవ్వ రాలేదు. మా పనిమనిషిని అవ్వ యింటికి పంపించాను ఎలా వుందో తెలుసుకుని రమ్మని.


"సీతమ్మకు నాల్గు దినాలనుండీ జ్వరమటండీ, అందుకే రావడంలేదట" చెప్పింది పనిమనిషి.

ఇక ఉండబట్టలేకపోయాను. 'అవ్వను చూడాలి ఎలాగైనా ఈ రోజు' అనుకున్నాను. సీతమ్మవ్వ తన యిల్లు మా యింటికి రెండిళ్ళవతలని చెప్పినా, ఆమె యిల్లు యెక్కడో నా కిప్పటి వరకూ తెలీదు. ఆ రోజు స్కూల్‌నుంచి వచ్చిన తర్వాత సాయంత్రం మా పనిమనిషిని సీతమ్మ యింటికి తీసుకెళ్ళమనడిగాను.

మా పనిమనిషి నావైపు ఓసారదోలా చూసి, "పదండయ్యా" అంది.

అప్పుడు సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. పొలాలనుంచి ఎడ్లను అదిలించుకుంటూ రైతులు యిళ్ళకి తరలి వస్తున్నారు. వీధిదీపంనుంచి వస్తున్న మసక వెల్తురులో ఆ దృశ్యాలు నా కంటికి చాల ఆకర్షణీయంగా కనపడసాగాయి.

పడిపోయే స్థితిలో వున్న ఓ పూరి గుడిసెను సీతమ్మ యిల్లుగా చూపించి మా పనిమనిషి వెళ్ళిపోయింది. ఓ నిముషం గుడిసెవంక చూసిన నేను, "అవ్వా! అవ్వా!" అని పిలిచాను. సమాధానం రాలేదు. తలుపు తోసుకొని లోనికి వెళ్ళాను. గుడ్డివెలుతురులో ఓ ఆకారం మూల్గుతూ కనిపించింది. దగ్గరకి వెళ్ళి చూసాను. సీతమ్మవ్వ కుక్కిమంచంలో పడుకొంది. మంచం ప్రక్కగా, క్రింద ఒక చిన్న మట్టి గిన్నెలో నీళ్ళు, ప్రక్కనే చిన్న కుండ, నాలుగయిదు మట్టిపాత్రలు, దండెంమీద వేసిన రెండు చిరిగిన చీరెలు – ఓ క్షణం గదిని పరికించిన నా కళ్ళు తిరిగి అవ్వ మీదకి చేరుకున్నయ్. దగ్గరగా నిలబడి పిలిచాను. సమాధానం రాలేదు. గట్టిగా మూలుగు వినిపించింది. నుదుటిమీద చేయి వేసి చూసాను. జ్వరం హెచ్చుగా




ఉన్నట్టుంది. నా చేయి 'చురుక్కు' మంది. మళ్ళీ పిలిచాను. ఈసారి అవ్వ కళ్ళుతెరిచి, నా ముఖంలోకి పరీక్షగా చూసింది ఎవరన్నట్టు?

"నేనవ్వా, మాష్టార్ని" చెప్పాను.

కంగారుగా లేచి కూర్చోబోయింది.

"వద్దు లేవొద్దు. అలా పడుకో".

"ఎప్పట్నుంచవ్వా, జ్వరం?-" ప్రశ్నించాను.

"నాల్గురోజులున్నుంచి బాబూ! అయినా మాష్టారుబాబూ, నాలాటి పేదదాని గుడిసెకు మీరు రావాలా బాబూ! కబురంపితే నేనే వచ్చేదాన్నిగా? ఎందుకు బాబూ, నేనంటే మీకింత అభిమానం" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అవ్వ ఇంకా ఏదో చెప్పాలనుకొంది కాని జ్వర తీవ్రతవలన మాట గట్టిగా రాలేదు.

"ఉండవ్వా, నీకు చాల జ్వరంగా వుంది. నేను వెళ్ళి డాక్టర్నితీసుకొస్తాను" లేవబోయాను.

"వద్దు బాబూ, మాలాటోళ్ళకి మందు లెందుకు! వయసు మీరిపోతోంది. ఏవో లేనిపోని రోగాలొస్తుంటాయి, పోతుంటాయి -" ఆ వ్యక్తికి మందు వేసుకోవడం యిష్టంలేదు.

అయినా వినకుండా వెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చాను.

మరుసటిరోజు నేను వెళ్ళేసరికి అవ్వ మంచంలో కూర్చుని ఉంది. జ్వరం బాగా తగ్గినట్టుంది. ముఖం పీక్కుపోయి, కళ్ళు లోతుకిపోయి, వారం రోజులకుపైగా జ్వరం పడిన మనిషిలా ఉంది. నన్ను చూసి, "రండి, బాబూ! యిలా కూర్చోండి" మంచం అంచు చూపిస్తూ అంది.

"అవ్వా,నీకెవ్వరూ లేరా? మొన్నంత

జ్వరంలోనూ నిన్ను పలకరించటానికెవ్వరూ రానేలేదు" తెచ్చిన బ్రెడ్ మంచంమీద పెడుతూ అన్నాను.

"నాకెవరున్నారు బాబూ? ఉన్నవాళ్ళప్పుడో దూరమైపోయారు. ఈ రోజో రేపో అన్నట్టు కాలం గడుపుతున్నాను. మాష్టారుబాబూ, మీరు నాకో సహాయంచేస్తారా?" ఉన్నట్టుండి అకస్మాత్తుగా అడిగింది సీతమ్మ.

"ఏంటవ్వా?"

"నేనెంతో కాలం బతకను. మిమ్మల్ని చూస్తుంటే నాకు నా బిడ్డ గుర్తుకొస్తున్నాడు. వాడెక్కడున్నాడో? ఏంటో? అసలున్నాడో లేడో? మునసబుగారికి నేనంటే ఎందుకయిష్టమో తెలుసా బాబూ! చెబుతాను వినండి నా కథ. విన్న తర్వాత మీరే చెప్పండి మాష్టారుబాబూ మా తప్పేవిటో" అవ్వ కథ యిలా చెప్పటం మొదలుపెట్టింది.

* * *

అవ్వది ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబమే. వాళ్ళాయనకి ఆ వూళ్లోనే రెండెకరాల మాగాణీ ఉండేది. అయితే అతనిది మంచి స్వభావంతోపాటు ముక్కుకు సూటిగా పోయే మనస్తత్వం. ఆ వూళ్ళో ప్రతిఏడాదీ పంటలు పండించి యింటికి తీసుకువచ్చిన రైతులు, భూస్వాములు ఓ నాల్గైదు బస్తాల ధాన్యం మునసబు యింటికి పంపించటం రివాజు. అది ఎప్పట్నుంచో ఆనవాయితీగా అక్కడ పాతుకుపోయింది. అయితే అందరిలా కాక, సీతమ్మ భర్త ఒక్క ధాన్యపుగింజ కూడ మునసబు వాకిట్లో విదల్చనేవాడు. పైగా స్వతంత్ర్య భావాలు కల్గిన ఆ పెద్దమనిషి మునసబు అన్యాయాన్ని ఎదుర్కొనడానికే యిష్ట పడేవాడు. అప్పటికీ సీతమ్మ చాలసార్లు చెప్పిచూసింది— "'ఊరంతా ఒకదారి ఉలిపికట్టె దొకదారన్నట్టు — వూళ్ళో వాళ్ళంతా ఎలా చేస్తున్నారో అలా చేయకూడదా? ఎందుకు లేనిపోని గొడవలు?" అన్నా వినిపించుకునేవాడు కాదు.

"నువ్వూరుకోయే! నీకేం తెలీదు. ఆ మునసబుగాడేమన్నా మహారాజా? వాడు చెప్పినట్లల్లా ఆడటానికి — మనం కష్టపడి పండించుకుంటున్నాము, కాబట్టి మనమే అనుభవించాలి. నువ్వెన్నన్నా చెప్పు నే నొప్పుకోనే యిటువంటి విషయాలకి," అంటూ సీతమ్మ మాట లక్ష్య పెట్టేవాడు కాదసలు.

ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. సీతమ్మకి పండంటి కొడుకు పుట్టాడు. దంపతులిద్దరి ఆనందానికి అంతులేదు. సీతమ్మకన్నా, వాళ్ళాయనకి కొడుకంటే పంచప్రాణాలు. పొలం తప్పితే, యింట్లో ఎప్పుడూ కొడుకుతోనే కాలక్షేపం. అతనికి మరో వ్యాపకం లేదు.

ఆ రోజు సీతమ్మ భర్త యింకా



యింటికి రాలేదు. అది సంధ్యాసమయం. పిల్లాడికి పాలుపట్టి, ఆడుకోవటానికి ఆట వస్తువులు ముందుపడేసి తలుపులు చేర వేసి స్నానానికి బయలుదేరింది. ఎవరో తలుపు దబదబ బాదుతుంటే భర్తొచ్చా డేమోనని తడివంటిమీదే చీరె చుట్ట బెట్టుకొని పరుగెత్తుకుని వెళ్ళింది తలుపు తీయడానికి. ఎదురుగా మునసబు. కంగారుగా చీరెను సర్దుకోబోయి, ఇంకా అస్తవ్యస్తంగా చేసేసుకుంది. సీతమ్మ తెల్లని, అర్ధనగ్న శరీరాన్ని చూసిన మునసబుకు వొళ్ళు వేడెక్కిపోయింది. కళ్ళల్లో ఎర్రజీర తొంగిచూసింది. కంగారుగా లోనికి వెళ్ళిపోయిన సీతమ్మను ఇంకేమీ ప్రశ్నించకుండానే, వెనకాలే వెళ్ళి బలంగా కౌగలించు కున్నాడు. ఉలిక్కిపడి అరవబోయిన సీతమ్మను నోరు మూసేసి ఆమెను వివస్త్రను చేయటానికి ప్రయత్నించిన సమయంలో పిల్లాడి ఏడుపు, ఆ వెనుకే తలుపు చప్పుడుతో తేరుకొని సీతమ్మను వదలి పెరటిగుండా పారిపోయాడు మునసబు.

మునసబు గడియవేసిన తలుపును తీసిన సీతమ్మను, "ఏం చేస్తున్నావే లోపల? ఎంతసేపట్నుంచని తలుపు కొట్టాలి? పిల్లాడు కూడ ఏడుస్తున్నట్టు న్నాడు?" లోనికివస్తూ అన్నాడు సీతమ్మ భర్త. కంగారు నణచుకుంటూ, సీతమ్మ "స్నానం చేసాను. బట్టలు మార్చు కుంటున్నాను," అంది నెమ్మదిగా.

'ఊఁ' అనుకుంటూ లోపలికి వెళ్ళి పోయాడు అతడు, స్నానం చేయటా నికంటూ.

సీతమ్మ ఆలోచిస్తోంది. మునసబు సంగతి చెబుదామా? వద్దా? అని చెప్పక పోతే అతని ఆగడాలు మితిమీరవచ్చు. చెబితే పరిస్థితి ఎలా వుంటుందో? అసలే తన భర్త కోపిష్టి. కోపంలో రెచ్చిపోయి మునసబుతో తగూ పెట్టుకుంటాడు కూడ. మునసబుకూ. అతనికీముందే చుక్కెదురు. సర్లే, అంతకీ తప్పనిసరైతే చెప్పొచ్చు.లేనిపోని గొడవలు తెచ్చుకుని సుఖంగా సాగిపోతున్న కాపురాన్ని నడివీధిలో నిలబెట్టుకోవడమెందుకని, వూరుకుంది. ఏమీ ఎరగనట్టు.

నాల్గురోజులు గడిచాయి. సీతమ్మ యిదివరకులా కాక కాస్త భయంగా వుంటుందీ మధ్య! మునసబుగానీ మళ్ళీ వస్తాడేమోనని. ఆ రోజు మధ్యాహ్నం మునసబు రానే వచ్చాడు తలుపు తోసుకుని. కంగారుగా బయటకు పారిపోబోయిన సీతమ్మను వాటేసుకొని తలుపులు బిగించేసాడు. ఎంతో పెనుగు లాడసాగింది సీతమ్మ.

"బాబూ! మీలాటి పెద్దోళ్ళకి తగదు యిటువంటి పని. మీరు కోరుకుంటే ఎంతోమంది మాకంటే అందమైనోళ్లు, వయసులోనున్నవాళ్ళు మీ కాళ్ళ దగ్గర కొస్తారు. మాలాంటి కులం తక్కువోళ్ల ఒళ్ళు మీకెందుకు బాబూ! "చేతులడ్డం పెట్టుకుని బతిమాలుతూ ఏడ్వసాగింది.

"సీతమ్మా! నీలాంటి అందగత్తెను నేనెక్కడా చూళ్ళేదనుకో. ఒక పిల్లాడికి తల్లివైనా ఎంత పిటపిట లాడుతోంది నీ శరీరం—కులమేమిటే, పిచ్చిదానా! శరీరానికి కావల్సింది- సుఖం, ఆనందం" సీతమ్మను బలంగా మీదికి లాక్కుంటూ అన్నాడు. సీతమ్మ మహంకాళిలా ఒక్క సారిగా విజృంభించింది.

"ఛీ దుర్మార్గుడా, వదులు! ఈ శరీరం నా మావ ఒక్కడికే! వాడితో ఒక్క మాట చెప్పానంటే నీ ప్రాణాలు తీసేస్తాడు" అంటూ బలంగా మునసబును పక్కకు త్రోసి పెరటి గుమ్మంలోంచి పారిపోయింది- ఏడుస్తున్న పిల్లవాడిని చంకనేసుకుని. తలకి బలంగా మంచం కోడు కొట్టుకోవడంతో తలబొప్పికట్టి కళ్ళు తిరిగినట్లయింది మునసబుకు. ప్రక్కనే ఉన్న కుర్చీమీద కూలబడి పోయాడు.

తలుపు త్రోసుకొచ్చిన సీతమ్మ భర్త మునసబును చూసి ఒక్క క్షణం నిశ్చేష్టుడైపోయాడు. తేరుకుని, "ఏంటి మునసబుగారు, మీరు .... మీరు ఎందుకొచ్చారిక్కడికి?" మొహం జేవు రించగా కటువుగా అడిగాడు.

"అదికాదు . నేను అదే నేను ....అదే పొలంపన్ను ఇంకా కట్టలేదని గుర్తుచేయటాని కొచ్చాను" తడబడుతూ

అన్నాడు గబగబా బయటికి వెళ్ళి పోతూ. అప్రతిభుడై పోయాడు సీతమ్మ భర్త.

గబగబా యిల్లంతా వెతికాడు అతను. సీతమ్మ లేదు. కోపంతో అతని మొహం ఎర్రగా కందిపోయింది. కోపాన్ని బలవంతంగా అణుచుకుం టున్నాడనటానికి నిదర్శనంగా అతని మెడపైనున్న నరాలు అదురుతున్నాయి. ఆలోచిస్తూ పడుకున్నాడు మంచంమీద. అరగంట గడచిన తర్వాత సీతమ్మ వచ్చింది పిల్లవాడితో. మంచంమీదున్న మొగుడిని చూసి ఆశ్చర్యపోయింది ఆ సమయంలో.

"ఏంటి ఈవేళప్పుడొచ్చావ్ ?"

"ఏం రాకూడదా?" కొరడాతో కొట్టిన ట్లొచ్చింది జవాబు.

ఏం మాట్లాడాలో తోచలేదు సీతమ్మకు ఓ క్షణం.

"అదికాదు .... ఒళ్ళు బాగోలేదా, ఈ వేళప్పుడొచ్చావ్?" మళ్ళీ ప్రశ్నించింది

"ఒంట్లో కాదు . ఇంట్లోనే" .. చెప్పులేసుకుని త్వరగా బయటి కెళ్ళిపోయాడు.

చెరువుగట్టున కూర్చున్న సీతమ్మ భర్తకు అచ్చటి చల్లగాలి ఒంటికి సేద దీర్చడంలేదు. పైగా శరీరమంతా వుడికి పోతున్నట్టుగా వుంది అసలు సీతమ్మ గురించి ఏవిధంగానూ ఊహించుకోలేక పోతున్నాడు. మునసబు ఆ సమయంలో తన యింటికి ఎందుకు వచ్చినట్టు? పోనీ అతను వచ్చినట్టు సీతమ్మ ఎందుకు చెప్పలేదు? నిజంగా వాళ్ళిద్దరి మధ్యా ఏదో వుంది- అందుకే అంత కంగారుగా పారిపోయాడు మునసబు తనను చూసి అనుకున్నాడు. నిశ్చలంగా వున్న చెరువులో రాయి విసరినట్లున్న మనసుతో యింటిముఖం పట్టాడు.

సీతమ్మకి చాల దిగులుగా వుంది. ఏ విధంగానూ మనసును సరిపెట్టుకోలేక పోతోంది. మునసబు సంగతి మావ పసిగట్టాడేమోనని అనుమానంగా కూడ ఉంది. 'ఏమైనా సరే జరిగిన సంగ తంతా మావకి చెప్పెయ్యాలి' అనుకుంది. యింటికొచ్చిన భర్త మౌనంగా అన్నం తిని ఒక్కమాట కూడ మాట్లాడకుండా పడుకుంటే, ఏడుపొచ్చినంత పనయింది సీతమ్మకు. మౌనంగా వెళ్ళి అతని కాళ్ళదగ్గర కూర్చుని కాళ్ళు నొక్కుతూ

"మావా! ఏం అలా వున్నావ్?" ప్రశ్నించింది.

"ఏం లేదు" - ఒక్క నిముషం తర్వాత వచ్చింది జవాబు.

"మావా! చెప్పటం మరిచాను - మునసబుగారొచ్చారు మధ్యాహ్నం నీతో ఏదో పనుందంటూ!" చెప్పకూడదను కుంటూనే చెప్పింది. అయితే అతని వద్దనుంచి దానికేమీ సమాధానం రాలేదు సంభాషణ ఇంకెలా పొడిగించాలో

తెలీక మౌనంగా వూరుకుంది తాత్కా- లికంగా.

నాలుగురోజులు గడిచాయి.

సీతమ్మకు, ఆమె భర్తకు మధ్య మౌనం పునాదులు వేసుకోసాగింది.

సీతమ్మకు భయం పట్టుకుంది. కనీసం అతనేమన్నా అడిగితే అంతా చెప్పేయ్యా లనుకుంది. ఐతే అతను ఆ అవకాశమే యివ్వకుండా ప్రవర్తిస్తున్నాడు. ఆ రోజు రాత్రి సీతమ్మ ఒక దృఢనిశ్చయాని కొచ్చేసింది, "ఏమైనా సరే మావకి జరిగింది జరిగినట్టు చెప్పేయ్యాలి,తర్వాత ఏం జరిగినా ఫరవాలేదు."

తెల్లవారింది.

లేచి చూస్తే మంచంమీద భర్తగాని, పిల్లవాడుగాని లేరు. 'ఇంత ఉదయమే పిల్లవాడిని తీసుకుని ఎక్కడికెళ్ళాడో?' అనుకుంటూ వరండాలోకి వచ్చి చూసింది. అక్కడా లేడు. మధ్యాహ్నం వేళయింది. అతను రాలేదు. సీతమ్మకి మతిపోయి నట్లయింది, ఎంత బుర్ర పగలకొట్టు కున్నా అర్థంకాలేదు. కంగారుగా తెలిసిన వాళ్లిళ్ళన్నీ చూసింది. ఫలితం శూన్యం. మూడురోజులు గడిచాయి సీతమ్మ బెంగగా తిండీ తిప్పలూ మానేసి అలా గుమ్మంకేసి చూస్తూ కూర్చునేది గంటల తరబడి. మునసబుగాని మావనేమన్నా చేయించాడా? అన్న అనుమానం కూడ వచ్చింది.

రోజులు . నెలలు గడిచాయి. సీతమ్మకు భర్త జాడ తెలీలేదు. గుండె నిబ్బరం చేసుకుని బ్రతకటం నేర్చుకుంది రేపుపై ఆశ ఉంచుకుని.

ఆ రోజు తర్వాత మునసబు మళ్ళీ రాలేదు. లోకం కన్ను కప్పటానికి కొంత వ్యవధి యిస్తే మంచిదను కున్నాడు. అదీగాక ఈలోగా సీతమ్మ కూడ కాస్త తేరుకుంటాది విచారంలో నుంచి.

అది మహంకాళి జాతర రోజు. ఆడా, మగా - పిల్లా, పెద్దా అంతా రాత్రి భోజ నాలు కానిచ్చి, ఉన్న బట్టల్లో మంచివి వేసుకుని జాతర చూడటానికి వెళ్ళి పోయారు. సీతమ్మకు ఆ రోజు చాల దిగులుగా ఉంది. ప్రతి అమ్మవారి జాతరకు అతను తనకు మంచి చీరె కొని జాతరంతా చూపించి తీసుకొచ్చేవాడు. ఆ రోజు తన గురించి ఎంతో డబ్బు ఖర్చుచేసేవాడు. సీతమ్మకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్. గుమ్మంలోంచి లేచి లోనికి వెళ్ళబోయింది. అంతే .... అవాక్కయిపోయింది. గుమ్మంలో మునసబు. మనిషి బాగా తాగున్నాడు. "ఏయ్ సీతాలు మన కింక అడ్డులేదే. తరిమేశాను నీ మొగుడ్ని. ఆడింక రాడు. మనిద్దరం జలసాగా వుండొచ్చు. నువ్వేం దిగులెట్టుకోకు .. నేనుంచుకుంటాగాని నిన్ను " ఏదేదో వాగుతూ సీతమ్మ మీద పడ్డాడు.

అప్పుడు తెల్సింది సీతమ్మకు,

మునసబే తనమీద పుకార్లు పుట్టించి తన మావ మనసు విరిచేసాడని

స్వతహాగా స్వాభిమానియై, ఎవరితోనూ ప్రత్యక్షంగాగాని పరోక్షంగా గాని మాట పడని సీతమ్మ భర్త-వూర్లో ప్రజల గుసగుసలు త్రాచుపాము బుసబుసలుగా అనిపించి, పిరికివాడై యింట్లోంచి పారిపోయాడు నిజా నిజాలు తెలుసుకోకుండానే. సీతమ్మకు కోపంతో, అసహ్యంతో శరీరం ఊగిపోతోంది. ఆవేశం, దుఃఖం ఒక్కసారిగా కలిసిపోగా మునసబుతో, "బాబుగారూ! ఎందుకు మీరు మాతో ఇలా ఆడుకుంటున్నారు? మేమే దొరికామా ఈ వూళ్ళో మీకు? మీకు పుణ్యముంటుంది నా జోలికి రాకండి బాబూ!" వేడుకుంటూ అంది. తాగిన నిషాలో నున్న మునసబుకు ఆ మాటలేం తలకెక్కలేదు. మీదకు రాబోతున్న మునసబును సీతమ్మ బలవంతంగా తోస్తూ, "ఆగు" గర్జించింది.

ఆ గర్జనతో ఒక్కసారి ఆగిపోయాడు మునసబు.

"నేను చెప్పేది విను, తర్వాత నీ యిష్టం" అంది సీతమ్మ.

"ఏవిటి .. ఏవిటే. " మీదికొస్తూ అన్నాడు.

"ఇలా, చూడు . " చీరె పైకెత్తి ఓ మచ్చను తొడమీద చూపిస్తూ అంది.

"చూసావా! యిదేం మచ్చను కుంటున్నావ్? .. ఇది...ఇది....కు... ష్టరో....గం . మచ్చ. నీకు తెలీదేమో.. అందుకే నా మొగుడు నన్నొదిలి పారిపోయాడు పిల్లవాడితో. నువ్వేమో, నీ ప్రతాపంవల్లే పారిపోయాడను కుంటున్నావ్ యింతవరకూ. రా .... యిప్పుడు చెప్పటం నా ధర్మం కాబట్టి చెప్పాను.

"రా . నన్ను నీ యిష్టంవచ్చినంతసేపు అనుభవించు" మంచంవైపు దారి తీస్తూ అంది.

నిషా దిగిపోయింది మునసబుకు. సీతమ్మ చెబుతున్నది నిజమో అబద్ధమో తెలుసుకోకుండానే, "ఛీ ....దరిద్రపు ముండలు" అని విదిలించుకుని, తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

సీతమ్మ ఆ విధంగా ఆ గండం తప్పించుకుంది. అయితే భయంవల్లనో, మరెందువలనో మునసబు సీతమ్మ సంగ తప్పట్నుంచీ పట్టించుకోవడం మానేసాడు. సీతమ్మ పేరనున్న పొలం కూడ దొంగలెక్కలు రాసేసుకుని తన పేర కలిపేసుకున్నాడు.

అప్పట్నుంచీ, సీతమ్మ ఆ వూరిలో ఓ మూలగా గుడిసె వేసుకుని కాలం నెట్టుకొస్తోంది.

* * *

"అది బాబూ! ఈ దిక్కుమాలిన దాని కథ. నువ్వే చెప్పు బాబూ! ఏమిటి మేం చేసిన నేరం? పరువుగా, నీతిగా

సంసారం చేసుకోటం మా తప్పా? లేక పోతే దేవుడిచ్చిన అందమైన శరీరం కలిగుండటం నా తప్పా?"

సీతమ్మ కథ విన్న తరువాత నా మనసంతా భారంగా అయిపోయింది. ఆమెమీద జాలి పెరిగిపోయింది. "ఇన్ని సంవత్సరాలుగా ఇంత బాధ మనసులో పెట్టుకుని ఎలా మనగలుగుతుందా?" అనిపించింది.

"అయితే, అవ్వా! మీ ఆయన ఇంకా బ్రతికే ఉన్నాడనుకుంటున్నావా?" అనకూడని మాట అనేసాననుకుంటా.

"అలా అనకండి బాబూ! నా మావ బ్రతికున్నాడనే నా నమ్మకం. అందుకే ఎవరెన్ని చెప్పినా నేను బొట్టు పెట్టు కోవడం, గాజులేసుకోడం మానలేదు: ఆడెప్పటికైనా తిరిగివస్తాడనే నా నమ్మకం" అంది.

'ఎందుకడిగానా'? అని బాధపడ్డాను ఓ క్షణం.

"బాబూ!" ఐదు నిముషాల మౌనం తరువాత నెమ్మదిగా పిలిచింది సీతమ్మ.

"ఏం అవ్వా?"

"బాబూ! మీరు నాకో చిన్న వుపకారం చేసిపెట్టాలి. నేను నా మావగాని, బిడ్డగాని రాకుండా పోతే ఈ దిక్కు మాలినదాని శరీరాన్ని మీరే తగులబెట్టే యాలి బాబూ! ఎంత లేమిలో బ్రతికినా, కనీసం నా చావైనా ఎవరో నీలాంటి పుణ్యాత్ముల చేతులమీదుగా పోతే, అదే నా ఆత్మకు తృప్తి. ఇట్లా అడిగానని ఏమనుకోకు బాబూ! ఎటువంటివాడికైనా దిక్కుమాలిన చావు చచ్చిపోవటం యిష్టం వుండదు.

బాబూ! మీ మీదింత భారం పెట్టేసానని అనుకుంటున్నారా? మీ కింతకాలం చెప్పలేదు కదూ! నేను ఈ బంగారు ముక్కుపుడకలను ఎటువంటి పరిస్థితులలోనూ ఎందుకు తీయలేదో! కనీసం.... నేను చచ్చిపోతే నా వొంటి మీదున్న వీటిని చూసైనా ఎవరైనా పుణ్యాత్ములు నా శవాన్ని దహనం చేస్తారనే వీటిని వొంటిమీద వుంచుకున్నాను. బాబూ! నువ్వేరికే నా కీ వుపకారం చేయనవసరంలేదు. నా మీదున్న ఈ కొంచెం బంగారం తీసుకొని వాటి నమ్మి, ఆ డబ్బును నా శవదహనం కోసం ఖర్చుపెట్టు. ఈ కాస్త వుపకారం మాత్రం చేస్తానని మాటియ్యి బాబూ!" ఏడుపు స్వరంతో అంది సీతమ్మవ్వ.

నాకు బాధతో ఒక్క క్షణం మాట రాలేదు అవ్వ అన్న మాటలకు.

"తప్పకుండా చేస్తానవ్వా, నువ్వు చెప్పినట్టు. అయితే నీ బంగారంతో మాత్రం కాదు. అది నీతోపాటే, నీ వొంటి మీదే కాలిపోవాలి. అయినా, అవ్వా! నువ్వనవసరంగా దిగులుపడుతున్నావ్, చచ్చిపోతానేమోనని– నీ కిపుడు వయ సేమంత మించిపోయిందని" నవ్వు తెచ్చుకుంటూ అన్నాను.

అవ్వ ఆనందంగా చూసింది ఆ మాటలకు. ఆమె కళ్ళల్లో ఏ కవీ రాయ లేనంతటి కృతజ్ఞతాభావం కనపడింది. కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా అవ్వకు నోట మాట రాలేదు.

కొంచెంసేపు కూర్చుని అవ్వకు ధైర్యం చెప్పి యింటికి వచ్చేసాను.

* * *

రెండు రోజులు గడిచాయి.

ఓ రోజు వుదయాన్నే తలుపు చప్పుడవటంతో లేచి వెళ్ళి తలుపు తీసాను. ఎదురుగా మా పనిమనిషి.

"బాబుగోరూ! చానా అన్నేయం జరిగిపోనాదండీ బాబూ! మన సీతమ్మను ఎవరో చంపి పారేసారు ఆ పొలం గట్టుమీద." ఒగర్చుకుంటూ, కంగారుగా చెప్పింది.

"ఏవిటి? సీతమ్మను చంపేసారా! ఎవరు!" ఆతృతగా అడిగాను.

"ఏమో బాబూ! మీరు త్వరగా రండి. అక్కడంతా చూట్టాని కెళ్ళేరు" చెప్పింది.

ఉన్నపాటునే పరుగులాంటి నడకతో అనుసరించాను మా పనిమనిషిని, తలుపు కూడ వేయకుండానే.

ఆ ప్రదేశం అంతా జనం గుమిగూడి వున్నారు. ఓ వైపు మునసబు, కరణం మౌనంగా నిలబడున్నారు. ఆడవాళ్ళు వాళ్ళలో వాళ్ళు ఏవో గుసగుసలాడు కుంటున్నారు. అందర్నీ తోసుకునిముందు కెళ్ళిన నేను నిశ్చేష్టుడినైపోయాను.

కనుగ్రుడ్లు పైకితేలి, నోరు తెరచు కుని, పొలంగట్టుమీద భయంకరమైన రూపంతో పడివుంది సీతమ్మ. ఎవరో గొంతు నులిమి చంపేసినదానికి గుర్తుగా ఎర్రగా కందిపోయిన నాల్గైదు చారలు కనపడుతున్నాయి మెడమీద. ఎప్పుడూ ముక్కుకి మెరుస్తూ కనపడే బంగారు ముక్కుపుడకలు లేవు. నాసికారంధ్రాలు తెగిపోయి వాటినుంచి, నోటినుంచి నోటి లోనికి కారిన రక్తం గడ్డకట్టుకుని పోయింది. బహుశా హంతకుడు, చంపేసిన తర్వాత కంగారులో ముక్కు పుడకలను బలవంతంగా తెంపుకుని పోయుంటాడు.

సీతమ్మను పరీక్షించిన నా కళ్ళు క్షణంలో నీళ్ళతో నిండిపోయాయి. మనసు మూగగా రోదించింది. సీతమ్మ అవ్వకు చాల అన్యాయం జరిగిపోయింది.

"ఏం చేస్తామండీ! రాత నెవ్వరూ తప్పించుకోలేరుకదా! దాని కలా వుంది. అలా పోయింది." శవవేదాంతం వల్లిస్తూ అన్నాడు మునసబు. నేనేం మాట్లాడలేదు.

ఇంతలో పోలీస్ ఇన్స్పెక్టరూ, ఇద్దరు కానిస్టేబుల్సూ కేసు బుక్ చేసుకోటాని కొస్తే వాళ్ళను కలవటాని కెళ్ళిపోయాడు మునసబు.

సీతమ్మ శవాన్ని పోస్టుమార్టమ్‌కి ప్రక్కనున్న పట్టణంలోపెద్దాశుపత్రికి పంపించారు.

నా మనసంతా శూన్యంగా అయిపోయింది. కాళ్లు తేలిపోతున్నాయి. ఒళ్ళు తూలిపోతున్నట్లయింది. ఇంటికెలా వచ్చానో తెలీదు.

రెండు రోజుల తర్వాత మెలకువ వచ్చింది. చూస్తే నా ప్రక్కన నా 'కొలీగ్' మోహనరావు కూర్చుని వున్నాడు. ఒక్కసారిగా పైకి లేవబోయాను.కాని లేవలేకపోయాను నా శరీరం నా అధీనంలో ఉన్నట్టులేదు. నీరసంగా వుంది.

"సీతమ్మ చచ్చిపోయిన రోజునుంచీ నీకు ఒకటే జ్వరం. ఏం భయపడ్డావా? మరీ యింత పిరికివాడివైతే ఎలాగోయ్! మనం మగాళ్ళం, ధైర్యంగా ఉండాలి" అన్నాడు మోహనరావు.

సీతమ్మవ్వ గురించి ఏదో అడగాలనుకున్నాను. కాని ఎందుకో అడగలేకపోయాను.

మరుసటిరోజు సీతమ్మవ్వ శవం కోసం పట్టణంలోని పెద్దాసుపత్రికి వెళ్ళాను.

"సారీ! మిష్టర్, ఐయామ్ వెరీ సారీ! నిన్నటివరకూ ఉంచాం ఆవిడ శవాన్ని. ఎవరూ రాకపోతే, ఆవిడకెవ్వరూ లేరేమోనని నిన్నటి రాత్రి మునిసిపాలిటీ వాళ్ళ కిచ్చేసాం శవాన్ని." చెప్పాడు పెద్ద డాక్టరు.

ఉసూరుమంది ప్రాణం. సీతమ్మ ఏది కాకూడదనుకుందో అదే అయింది. సీతమ్మవ్వ మాటలు నా మనసులో యింకా గింగురుమంటున్నాయి. "మాష్టారు బాబూ! నేను చచ్చిపోతే నా శవాన్ని మీరే దహనంచేయాలి. ఎటువంటోడికైనా దిక్కుమాలిన చావుచావటం యిష్టవుండదు. నాకీ ఒక్క వుపకారం చేసిపెట్టు బాబూ! చేస్తారు కదూ!"

నా కళ్ళలో నీళ్లు తిరిగాయి. "నన్ను క్షమించవ్వా! నీకిచ్చినమాట నిలబెట్టుకోలేకపోయాను. నేను నిజంగా దురదృష్టవంతుడ్ని. అందుకే కనీసం నీ శవాన్ని దహనం చేయటానికూడా నోచుకోలేకపోయాను. భగవంతుడు ఆ లోకంలోనైనా నీ ఆత్మకు శాంతి కలుగజేయాలి. ఇంతకన్నా నేనేం కోరుకోగలను? నీరసంగా అడుగులేసుకుంటూ యింటి ముఖం పట్టాను.

